

ప్రజా న్యూస్

— నెటవర్క్ —

నిజం.. సమాజం.. ప్రజా కోసం.. తెలుగు దినపత్రిక



సంపుటి :01,సంచిక : 188,చీఫ్ ఎడిటర్ : వి.శివ కృష్ణ, వెల : 02,గురువారం, తేదీ : 12-11-2026

PUBLISHED BY HYDERABAD : Circulation Areas:TELANGANA & ANDHRA PRADESH

రైతులకు గుడ్ న్యూస్- రూ.62,370 కోట్ల

సబ్సిడీకి కేంద్రం ఆమోదం

- కేంద్ర మంత్రివర్గం బుధవారం కీలక నిర్ణయాలు తీసుకుంది.
- ముఖ్యంగా రబీ సీజన్ లో ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీకి ఆమోదం తెలిపింది.



ఢిల్లి : రబీ సీజన్‌లో ఎరువుల కోసం రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. అలాగే నార్త్, సౌత్ బ్లాక్ లను మ్యూజియంగా మార్చేందుకు అనుగుణంగా యుగే యుగీన్ మ్యూజియం అభివృద్ధికి రూ.3,230 కోట్లు కేటాయించేందుకు నిర్ణయించింది. నోయిడా సెక్టార్ 51 నుంచి గ్రేటర్ నోటియా సెక్టార్ 4 వరకు రూ.2,390 కోట్లతో మెట్రో రైలు మార్గం ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. స్టాండ్ -అప్ ఇండియా పథకానికి, అలాగే ముద్రా యోజన కింద సూక్ష్మ యూనిట్లకు క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ను 5 సంవత్సరాలపాటు కొనసాగించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. వాటి పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

ముద్రా రుణాలు

సూక్ష్మ పరిశ్రమల కోసం ఉద్దేశించిన 'క్రెడిట్ గ్యారెంటీ ఫండ్ ఫర్ మైక్రో యూనిట్స్ ' (సీజీఎఫ్ ఎంయూ) పథకాన్ని కేంద్ర కేబినెట్ మిగతా..2లో

రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియం.. కేంద్ర కేబినెట్ ఆమోదం



- రూ. 3,230 కోట్ల ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం
- నార్త్, సౌత్ బ్లాక్ భవనాల్లో భారీ మ్యూజియం నిర్మాణం
- ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలంగా రికార్డు
- 2027 ద్వితీయార్థంలో తొలి గ్యాలరీ ప్రారంభం
- ఏడాదికి కోటి మంది సందర్శకుల రాక అంచనా

ఢిల్లి : భారతదేశ ఘనమైన చరిత్ర, నాగరికత, సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు సజీవంగా అందించే లక్ష్యంతో ప్రతిపాదించిన బృహత్తర ప్రాజెక్టు 'యుగే యుగీ భారత్ నేషనల్ మ్యూజియం' నిర్మాణానికి మార్గం సుగమమైంది.

మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు

తీవ్ర అస్వస్థత ఆసుపత్రికి తరలింపు

- మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తీవ్ర అస్వస్థతకు గురైనట్లు సమాచారం.
- మార్నింగ్ వాకింగ్ చేస్తుండగా ఆయన స్పృహతప్పి పడిపోయినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి.



హైదరాబాద్: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ తీవ్ర అస్వస్థతకు గురైనట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. బుధవారం ఉదయం వాకింగ్ కు వెళ్లినప్పుడు స్పృహతప్పి పడిపోయినట్లు సమాచారం. కొద్ది నిమిషాల పాటు అపస్మారక స్థితిలో ఆయన్ను పీసీఆర్ వాహనంలో ఇంటికి తీసుకెళ్లారు భద్రతా సిబ్బంది. ఆ తర్వాత ఐఎల్బీఎస్ వైద్య బృందం, ఎయిమ్స్ వైద్యుడు సందీప్ సేథ్ ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. అయితే, ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో వెంటనే ఆయన్ను ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించినట్లు వర్గాలు తెలిపాయి. ధన్ ఖడ్‌ను ఆసుపత్రిలోని కార్డియో-న్యూరో సెంటర్‌లో చేర్పించారని, ప్రస్తుతం ఆయన కార్డియాలజీ విభాగం పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారని సమాచారం. ఆయన ఆరోగ్య పరిస్థితికి సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. దీనిపై ఎయిమ్స్ ఆస్పత్రి యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయలేదు. గత రెండేళ్లుగా ఆయన పలుమార్లు స్పృహ కోల్పోవడం, మిగతా..2లో

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో పోటీపడేలా విద్యా సంస్కరణలు



- కాజీపేటలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన భట్టి విక్రమార్క
- సుమారు రూ.11 కోట్ల వ్యయంతో అందుబాటులోకి రానున్న నూతన పాఠశాల భవనం
- పేద బిడ్డలకు ప్రపంచ స్థాయి విద్యను అందించడమే లక్ష్యమన్న డిప్యూటీ సీఎం

హైదరాబాద్: తెలంగాణ బిడ్డలు ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో

తెలంగాణ విద్యా వ్యవస్థలో భారీ మార్పులు..

వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే తెలంగాణలో 10+2 విధానం
- అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు
- నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు ప్రాధాన్యం
- 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ
- ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా మౌలిక వసతులు



హైదరాబాద్: రాష్ట్ర విద్యా వ్యవస్థలో భారీ మార్పులకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచే పాఠశాల విద్యలో 10+2 విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యా విధానాన్ని మార్చడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యాశాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం పలు కీలక సూచనలు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సంస్కరణల అమలులో ఏ ఒక్క విద్యార్థికి నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మిగతా..2లో

80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు



- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత
- ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య
- యువత డబ్బులకు అమ్ముడుపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు

హైదరాబాద్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని

ఏపీకి మరో వాయుగుండం ముప్పు.. ఈ తేదీల్లో వర్షాలు కురిసే ఛాన్స్!



ఆగ్నేయ బంగాళాఖాతంలో ఎల్లుండి అల్పపీడనం

ఇది బలపడి వాయుగుండంగా మారే అవకాశం

నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరవచ్చని అంచనా

దీని ప్రభావంతో దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఎల్లుండి అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఇది క్రమంగా బలపడి వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని తెలిపింది. నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరవచ్చని అంచనా వేసింది. అల్పపీడనం ఏర్పడిన 24 గంటల్లోనే తీవ్ర అల్పపీడనంగా బలపడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత వాయుగుండంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. మిగతా..2లో

ఆటో, ఈవీ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యం.. పారిశ్రామికవేత్తలతో మంత్రి పొన్నం భేటీ



మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి భేటీ

సమావేశానికి హాజరైన 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు

వచ్చే నెలలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై దృష్టి

తెలంగాణను అగ్రగామిగా నిలపడమే ధ్యేయమన్న మంత్రి

హైదరాబాద్: తెలంగాణను ఆటోమొబైల్, ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) పెట్టుబడులకు ప్రధాన కేంద్రంగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలను ముమ్మరం చేసింది. వచ్చే నెలలో జరగనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026'ను దృష్టిలో ఉంచుకుని ఈ దిశగా కీలక అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఆటో, ఈవీ రంగాల కోసం కొత్తగా ఏర్పాటు చేసిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం జరిగింది. మిగతా..2లో

చెప్పుడు మాటలు విని జగన్ నన్ను చాలా ఇబ్బంది పెట్టారు



- పరివర్తన రాజనీతి పార్టీని ప్రకటించిన విజయసాయిరెడ్డి
- వైసీపీలో 70కి పైగా అవమానాలను భరించానని ఆవేదన
- ఆ పార్టీ నుంచి తనను గెంటేశారని వెల్లడి
- అన్ని జిల్లాల నుంచి కీలక వ్యక్తులు తమ పార్టీలో చేరుతున్నారన్న విజయసాయి
- ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వెల్లడి

ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు..

ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి

- రూ.632 కోట్లతో 789 ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు
- ఖరీఫ్ నాటికి సాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలన్న చంద్రబాబు
- జలహారతి కార్పొరేషన్ ఆధ్వర్యంలో పథకాల పర్యవేక్షణ
- ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రణాళిక
- 36 ప్రాధాన్యతా ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యం



అమరావతి : గత ప్రభుత్వ హయాంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను (లిఫ్ట్ ఇరిగేషన్) తక్షణమే పునరుద్ధరించాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి ఈ పథకాల ద్వారా రైతులకు సాగునీరు అందించేలా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. సాగునీటి ప్రాజెక్టులు, ఎత్తిపోతల పథకాల నిర్వహణ, సౌర విద్యుత్ ఉత్పత్తి తదితర అంశాలపై నేడు ఆయన తన క్యాంపు కార్యాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మరమ్మతుల దశలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07 కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ పనులు పూర్తి చేయడం ద్వారా సుమారు 7.49 లక్షల ఎకరాల ఆయకట్టుకు స్థిరంగా సాగునీరు అందించవచ్చని వివరించారు. దీనిపై స్పందించిన సీఎం, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను అంచనా వేసి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. వచ్చే జూన్ నాటికి ఈ పథకాలన్నీ వినియోగంలోకి రావాలని గడువు విధించారు. ఈ పథకాల పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను 'జలహారతి కార్పొరేషన్' ద్వారా చేపట్టాలని, ఇందుకోసం ఒక ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ మిగతా..2లో

ఆంధ్రాలో నాన్-వెజ్ అనే ఆప్షనే ఉండదు

సీఐఐ సదస్సు వేళ నారా లోకేశ్ ఆసక్తికర పోస్ట్

- విశాఖలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- ఆంధ్రాలో నాన్-వెజ్ అనే ఆప్షన్ లేదంటూ చమత్కారం
- వెజ్ ఫుడ్ తో పాటు స్పీడీ అప్రూవల్స్ ఇస్తామని వెల్లడి



అమరావతి : విశాఖపట్నంలో రేపటి నుంచి జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యేందుకు విచ్చేసిన అంతర్జాతీయ ప్రతినిధులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వినూత్న రీతిలో స్వాగతం పలికారు. గ్లోబల్ డెలిగేట్స్‌ను ఆహ్వానిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా చేసిన ఓ ఆసక్తికర పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. రాష్ట్ర ప్రత్యేకతను వివరిస్తూ మంత్రి లోకేశ్ తనదైన శైలిలో చమత్కరించారు. "ఆంధ్రాలో 'నాన్-వెజ్' అనేది మెనూలో ఆప్షన్ కాదు" అంటూ ఆంధ్రప్రదేశ్ ఆహారపు ఘాటును, విశిష్ట రుచులను విదేశీ ప్రతినిధులకు పరిచయం చేశారు. రాష్ట్రంలో ఆహారం ఎంత ఘాటుగా ఉంటుందో, వ్యాపార పెట్టుబడులకు ఇచ్చే అనుమతులు కూడా అంతే వేగంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ప్రభుత్వ పనితీరును ప్రస్తావిస్తూ లోకేశ్ ఓ ఆకర్షణీయమైన నినాదాన్ని తెరపైకి తెచ్చారు. "స్పైసీ ఫుడ్.. స్పీడీ అప్రూవల్స్.. ఇదే ఆంధ్ర విధానం" అంటూ మిగతా..2లో

మొదటి పేజీ తరువాయి

ఆంధ్రాలో నాన్-స్పేసీ అనే ఆప్షనే ఉండదు
సీఐఐ సదస్సు వేళ నారా లోకేశ్ ఆసక్తికర పోస్ట్

ప్రపంచ పారిశ్రామికవేత్తలకు బలమైన సందేశాన్ని పంపారు. అతిథి మర్యాదలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేస్తామనే స్పష్టమైన భరోసాను ఆయన కల్పించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తూ మంత్రి చేసిన ఈ ట్వీట్ అందరినీ ఆకట్టుకుంటోంది.

చెప్పుడు మాటలు విని జగన్ నన్ను చాలా ఇబ్బంది పెట్టారు

అమరావతి : వైసీపీలో తాను తీవ్ర అవమానాలను ఎదుర్కొన్నానని మాజీ ఎంపీ, పరివర్తన రాజనీతి పార్టీ (పీఆర్‌పీ) అధినేత విజయసాయిరెడ్డి అన్నారు. విజయవాడలో తన పార్టీని ప్రకటించిన అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను వైసీపీని స్వచ్ఛందంగా వీడలేదని, తనను అవమానించి బలవంతంగా పార్టీ నుంచి బయటకు పంపించారని ఆయన స్పష్టం చేశారు. వైసీపీలో ఉన్న సమయంలో తాను 70కి పైగా అవమానాలను భరించానని విజయసాయిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మనిషి తట్టుకోలేని రీతిలో అక్కడ అవమానాలు జరిగాయని, ఆత్మగౌరవం దెబ్బతిన్న చోట ఎవరూ ఉండలేరని వ్యాఖ్యానించారు. వైసీపీ అధినేత జగన్ కొందరి చెప్పుడు మాటలు విని తనను తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. పార్టీ కోసం ఎంతగానో శ్రమించిన తనను చివరకు అవమానకర రీతిలో బయటకు నెట్టారని పేర్కొన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలోనే సరికొత్త రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టినట్లు విజయసాయిరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి కీలక వ్యక్తులు, నాయకులు తమ కొత్త పార్టీలోకి చేరుతున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు.

ఏపీకి మరో వాయుగుండం ముప్పు..
ఈ తేదీల్లో వర్షాలు కురిసే ఛాన్స్!

ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ ఉత్తర తమిళనాడు తీరం వైపు కదులుతుందని వివరించారు. ఈ ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే భారీ వర్షాల కంటే తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలే ఎక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఆ తర్వాత అల్పపీడనం కదలికను బట్టి వర్షాల పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

తెలంగాణ విద్యా వ్యవస్థలో భారీ మార్పులు..
వచ్చే ఏడాది నుంచే 10+2 విధానం!

రాష్ట్రంలో నర్సరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాల విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం పేర్కొన్నారు. 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉన్నత విద్యగా పరిగణించి విద్యార్థులకు ప్రత్యేక విద్య అందించాలని సూచించారు. విద్యార్థులకు 12వ తరగతి నుంచే నైపుణ్య శిక్షణ (స్కిల్లింగ్) అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని సీఎం స్పష్టం చేశారు.

తెలంగాణ బిడ్డలు అగ్ర దేశాలతో
పోటీపడేలా విద్యా సంస్కరణలు: భట్టి విక్రమార్క

విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. హనుమకొండ జిల్లా కాజీపేటలోని విద్యానగర్‌లో నూతన 'తెలంగాణ పబ్లిక్ స్కూల్' భవన నిర్మాణానికి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. స్థానిక బీసీ వెల్ఫేర్ బాలుర వసతిగృహం ప్రాంగణంలో సుమారు రూ.10 కోట్ల నుంచి రూ.11 కోట్ల అంచనా వ్యయంతో ఈ పాఠశాల భవనాన్ని నిర్మించనున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ... దేశంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్రంలో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్', 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. తెలంగాణలో పుట్టిన ప్రతి బిడ్డకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు. ప్రపంచంలోని పది అగ్రదేశాలతో తెలంగాణ విద్యార్థులు పోటీపడేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యావ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేస్తూ పటిష్ఠపరుస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగానే సెమీ రెసిడెన్షియల్ విధానంలో తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు భట్టి విక్రమార్క వివరించారు. ఈ పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు డిజిటల్ బోధన అందించడంతో పాటు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా సదుపాయాలు కల్పిస్తామన్నారు. మరోవైపు, ఉపముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో హనుమకొండలో ముందస్తు చర్యగా మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్‌తో సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు గృహనిర్బంధంలో ఉంచారు.

80 లక్షల మంది పట్టభద్రులలో
10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు

కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.

ఆటో, ఈవీ రంగాల్లో పెట్టుబడులే లక్ష్యం..
పారిశ్రామికవేత్తలతో మంత్రి పొన్నం భేటీ

హైబ్రిడ్ విధానంలో జరిగిన ఈ సమావేశంలో సుమారు 25 మంది ప్రముఖ పారిశ్రామికవేత్తలు, అగ్రశ్రేణి కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆటోమొబైల్ తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఈవీ ఛార్జింగ్ సదుపాయాలు, బ్యాటరీ టెక్నాలజీ, క్లీన్ మొబిలిటీ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాలపై ప్రధానంగా చర్చించారు. కొత్త యూనిట్ల ఏర్పాటు, ఇప్పటికే ఉన్న పరిశ్రమల విస్తరణ, విధానపరమైన అవసరాలపై పరిశ్రమ వర్గాల నుంచి మంత్రి సూచనలు కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ఈ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్‌కు సన్నాహాల్లో భాగంగానే ఈ కౌన్సిల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేశంలోనే ఆటోమొబైల్, ఈవీ పెట్టుబడులకు తెలంగాణను అగ్రగామి గమ్యస్థానాల్లో ఒకటిగా నిలపడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. సమ్మిట్‌లో ఈ రంగాలపై ప్రత్యేక సెషన్ నిర్వహించేందుకు అవసరమైన కీలక అంశాలను కూడా ఈ సమావేశంలో గుర్తించారు.

సూపర్ పీఎంగా మారేందుకే ప్రధాని పదవిని
వద్దనుకున్నారు'- సోనియా గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ ఎద్దేవా

కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ తన ఆత్మకథలో ప్రధాని పదవిని వద్దనుకున్నట్లు చేసిన వ్యాఖ్యలపై బీజేపీ తీవ్ర స్థాయిలో విమర్శలు చేసింది. ప్రధాని పదవిని వద్దనుకుని ఆమె చేసిన గొప్ప త్యాగం కేవలం సూపర్ ప్రీమీగా మారడానికేనని ఎద్దేవా చేసింది. భూటా హయాంలో ప్రధాని పదవిని వదులుకున్న సోనియా, కేబినెట్ హోదా కలిగిన నేషనల్ అడ్వైజరీ కమిటీ చైర్‌పర్సన్ పదవిని స్వీకరించారని బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది గుర్తు చేశారు. ఇలాంటి త్యాగాన్ని ప్రపంచంలో మరెక్కడా చూడలేమని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఆ పదవిపై వివాదం చెలరేగడంతో ఆమె రాజీనామా చేయాల్సి వచ్చిందని వెల్లడించారు. ఆ తర్వాత ఎన్నికల్లో గెలిచి వచ్చేలోపు ఆమె కనుసన్నల్లో నడిచే మన్మోహన్ సింగ్ ప్రభుత్వం నిబంధనలను మార్చి చీఫ్ చైర్మన్ పదవిని లాభదాయక పదవుల జాబితా నుంచి తొలగించిందని ఆరోపించారు. "ప్రధానమంత్రి పదవిని వదులుకుని ఆమె సూపర్ పీఎం అవ్వడం ఎంత గొప్ప త్యాగం! ప్రధానమంత్రి పదవిని వదులుకుని కేబినెట్ హోదాను స్వీకరించడం వంటి త్యాగానికి ఉదాహరణ ప్రపంచంలో ఎక్కడా మీకు కనిపించదు. జాతీయ సలహా కమిటీ చైర్‌పర్సన్, అది కూడా లాభదాయకమైన కేబినెట్ హోదా. ఒక వివాదం చెలరేగడంతో సోనియా గాంధీ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఎన్నికల తర్వాత ఆమె తిరిగి వచ్చేలోపే, మన్మోహన్ సింగ్ ప్రభుత్వం నిబంధనలను మార్చి, చీఫ్ చైర్‌పర్సన్ పదవిని లాభదాయక పదవుల జాబితా నుంచి తొలగించింది. సోనియా గాంధీ ప్రధానమంత్రి కావాలని కోరుకున్నారు. దీనికి నిదర్శనం ఏమిటంటే 1999లో అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతో మెజారిటీని కోల్పోయినప్పుడు, సోనియా గాంధీ అప్పటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ని కలిశారు. రాష్ట్రపతి భవనం నుంచి బయటకు వచ్చిన ఆమె, 'మాకు 272 మంది సభ్యుల మద్దతు ఉంది' అని ప్రకటించారు. అంటే, ఆమె ప్రధానమంత్రి కావాలని ఆశించారు, కానీ మిత్రపక్షాల నుంచి ఆమెకు తగిన మద్దతు లభిం"లేదు." అంతేకాకుండా, దేశంలో ఎమర్జెన్సీ విధించినందుకు సంజయ్ గాంధీని నిందించడం, అప్పటి ప్రధాని రాజీవ్ గాంధీ దీనిని వ్యతిరేకించారని సోనియా గాంధీ పేర్కొనడంపైనా త్రివేది

ఎత్తిపోతల పునరుద్ధరణకు రూ.632 కోట్లు.. ఖరీఫ్ నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు సిద్ధం కావాలి

మొదటి పేజీ తరువాయి

లేదా సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణను పటిష్టం చేయాలని తెలిపారు.

ఇరిగేషన్ భూముల్లో 903 మెగావాట్ల సౌర విద్యుత్

సమీక్షలో భాగంగా జలవనరుల శాఖ పరిధిలోని భూముల్లో సౌర విద్యుత్ ఉత్పత్తి అవకాశాలపై కూడా చర్చించారు. జలవనరుల శాఖ, ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 4,171 ఎకరాల భూమిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని అధికారులు సీఎంకు వివరించారు. కేవలం భూములే కాకుండా కాలువలపై కూడా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతరాయంగా



విద్యుత్ అందించి, మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు విక్రయించడం ద్వారా ఆదాయం పొందే మార్గాలను అన్వేషించాలని తెలిపారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

విద్యుత్ రంగానికి ఉన్నట్లుగానే జలవనరుల శాఖకు కూడా 'వాటర్ రెగ్యులేటరీ కమిషన్' ఏర్పాటు చేసే అంశాన్ని అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులకు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల తరహాలోనే సాగునీటి రంగంలోనూ ఒక నియంత్రణ వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. రవాణా, పరిశ్రమలు, వ్యవసాయం వంటి వివిధ రంగాలకు నీటి కేటాయింపులపై ఈ కమిషన్ నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దవచ్చన్నారు.

ప్రాజెక్టులకు నిధుల కొరత లేదు

ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా గుర్తించిన 36 సాగునీటి ప్రాజెక్టులను రాబోయే రెండున్నరేళ్లలో పూర్తి చేయాలని సీఎం లక్ష్యం నిర్దేశించారు. ఈ ప్రాజెక్టులకు నిధుల కొరత రానివ్వబోమని హామీ ఇచ్చారు. నిర్దేశిత గడువులోగా పనులన్నీ పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్‌కు తీవ్ర అస్వస్థత- ఆసుపత్రికి తరలింపు

మొదటి పేజీ తరువాయి

'అనారోగ్య కారణాలతో ధన్‌ఖడ్ రాజీనామా'

జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలి రోజున కార్యక్రమాలను సజావుగా నిర్వహించిన ఆయన రాత్రికల్లా అనూహ్యంగా రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాలవల్లే తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు. అయితే, జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అనంతరం విపక్షాలు తీవ్ర విమర్శలు గుప్పించాయి. ఆయన రాజీనామాపై కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు అనుమానాలను వ్యక్తం చేశాయి. ధన్‌ఖడ్ రాజీనామాకు అసలు కారణం అనారోగ్యం సమస్య కాదని, దాని వెనుక లోతైన కారణాలున్నాయని ఆరోపించాయి. ధన్‌ఖడ్‌ది ముమ్మాటికి బలవంతపు రాజీనామానేనని కాంగ్రెస్ విమర్శించింది. ప్రధాని మోదీ సహృదయంతో ఉండాలని, రాజీనామాపై ప్రభుత్వం తరపున వివరణ ఇప్పించాలని డిమాండు చేసింది. రైతు బిడ్డకు (కిసాన్ పుత్ర) కనీసం గౌరవమైన వీడ్కోలు కార్యక్రమమూ జరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. ధన్ ఖడ్ రాసిన లేఖలో, వైద్యుల సూచనల మేరకు ఆరోగ్యానికి ప్రాధాన్యమిస్తూ,



రాజ్యాంగబద్ధంగానే తాను ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నానని ధన్‌ఖడ్ పేర్కొన్నారు. బాధ్యతల నిర్వహణలో తనకు మద్దతుగా నిలిచిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, ప్రధాన మంత్రి, మంత్రి మండలికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని సహకారం, మద్దతు అమూల్యమైనదని, విధి నిర్వహణలో తాను ఎంతో నేర్చుకున్నానని పేర్కొన్నారు. పార్లమెంటు సభ్యుల నుంచి లభించిన గౌరవ మర్యాదలు, అభిమానం చిరకాలం గుర్తుంటాయని అన్నారు. భారత్ సాధించిన అద్భుతమైన ఆర్థిక పురోగతికి సాక్షిగా ఉండటం తనకు ఎంతో సంతృప్తినిచ్చిందని చెప్పారు.

రైతులకు గుడ్ న్యూస్- రూ.62,370 కోట్ల సబ్సిడీకి కేంద్రం ఆమోదం

మొదటి పేజీ తరువాయి

మరో 5ఏళ్లపాటు పొడిగించింది. అంటే 2031 మార్చి వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. పీఎం ముద్ర యోజన ప్రారంభమైనప్పటి నుంచి 2026 సెప్టెంబర్ వరకు బ్యాంకులు, రుణ సంస్థలు ఏకంగా 60.36 కోట్లకుపైగా రుణాలు మంజూరు చేశాయి. వాటి మొత్తం విలువ రూ.43.34 లక్షల కోట్లు ఉంటుంది. బ్యాంకులు లేదా రుణ సంస్థలు ఇచ్చే ఈ రుణాలకు డిఫాల్ట్ (రుణాలు తిరిగి చెల్లించలేకపోవడం) రిస్క్ లేకుండా సీజీఎఫ్ ఎంయూ పథకం రక్షణ లభిస్తుంది. అందుకే ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఈ రోజు జరిగిన కేబినెట్ సమావేశంలో దీనికి రూ.5వేల కోట్ల మేర నిధులు కేటాయించేందుకు ఆమోదం లభించింది. దీని ద్వారా రూ.12.6 లక్షల కోట్ల విలువైన ముద్రాయోజన రుణాలకు ఊతం లభిస్తుంది. 2016 జనవరిలో ప్రారంభమైన ఈ సీజీఎఫ్ ఎంయూ అనేది ముద్ర యోజన రుణాల వృద్ధిని వేగవంతం చేయడంలో ఒక ప్రధాన ఉత్ప్రేరకంగా పనిచేస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

స్టాండప్ ఇండియా

కేంద్ర కేబినెట్ స్టాండప్ ఇండియా పథకం గడువును 2031



మార్చి 31 వరకు అంచే ఐదేళ్లపాటు పొడిగించింది. మహిళలు, షెడ్యూల్డ్ కులాలు (ఎస్సీ), షడ్యూల్డ్ తెగల(ఎస్టీ)ల్లోని వ్యాపారవేత్తలను ప్రోత్సహించడానికి, అలాగే వారిలో పారిశ్రామిక నైపుణ్యాన్ని పెంపొందించడానికి ఈ పథకాన్ని ప్రారంభించారు. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, ఈ పథకం ద్వారా రానున్న 5ఏళ్లలో అదనంగా మరో 2.5 లక్షల మంది వ్యాపారవేత్తలకు ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. 2016 ఏప్రిల్ లో ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 2.75 లక్షల మందికి పైగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వ్యాపారవేత్తలకు ఈ రుణాలు అందించారు.

ఉత్పాదక, సేవా, వాణిజ్య రంగాలు లేదా వ్యవసాయ అనుబంధ రంగాల్లో సరికొత్త గ్రీన్ ఫీల్డ్ సంస్థలను స్థాపించడానికి గాను, ప్రతి షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకు శాఖ నుంచి కనీసం ఒక ఎస్సీ లేదా ఎస్టీ లబ్ధిదారునికి, కనీసం ఒక మహిళకు రూ.10 లక్షల నుంచి రూ.1 కోటి వరకు రుణాలు అందించడమే లక్ష్యంగా ఈ స్టాండప్ ఇండియా పథకం పనిచేస్తుంది. తక్కువ వడ్డీకి ఇచ్చే ఈ రుణాలకు గరిష్ఠంగా 18 నెలల వరకు మారటోరియం పీరియడ్ ఉంటుంది. అయితే ఈ రుణాలను 7 సంవత్సరాల్లోపు పూర్తిగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ రుణ మొత్తంలో 85 శాతానికి క్రెడిట్ గ్యారెంటీ లభిస్తుంది. దీని ప్రామాణిక గ్యారెంటీ ఫీజు 0.50 శాతంగా ఉంటుంది. ఎరువుల సబ్సిడీ రబీ సీజన్ 2026-27 కోసం ఫాస్ఫేట్, పొటాష్ ఎరువులకు రూ.62,370 కోట్ల సబ్సిడీ ఇచ్చేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ దీనిపై మాట్లాడుతూ, పశ్చిమాసియా సంక్షోభం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని అన్నారు. అందుకే రైతులకు తగినంత ఎరువుల సబ్సిడీ ఇచ్చేందుకు మోదీ ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు. 50 కేజీల డీఏపీ (డై-అమ్మోనియం ఫాస్ఫేట్) బస్తా ధర మునుపటిలాగానే రూ.1,350 ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

రూ.3,230 కోట్లతో 'యుగే యుగీ భారత్' మ్యూజియం.. కేంద్ర కేబినెట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ (ఇజజూా) అధికారికంగా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.3,230 కోట్లుగా నిర్ణయించారు. న్యూఢిల్లీలోని రైసినా హిల్స్‌పై రాష్ట్రపతి భవన్‌కు ఇరువైపులా ఉన్న చారిత్రక నార్త్, సౌత్ బ్లాకుల్లో ఈ సరికొత్త జాతీయ మ్యూజియాన్ని ఏర్పాటు చేయనున్నారు. 1912 నుంచి 1931 మధ్య కాలంలో నిర్మించిన ఈ కట్టడాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న ప్రభుత్వ కార్యాలయాలు ఇతర నూతన భవనాల్లోకి మారిన తర్వాత, వాటిని ప్రజా సాంస్కృతిక కేంద్రంగా తీర్చిదిద్దుతారు. ఈ క్రమంలో భవనాల అసలు శైలి, చారిత్రక నిర్మాణ వారసత్వానికి ఎలాంటి విఘాతం కలగకుండా పునరుద్ధరించనున్నారు. ఈ మ్యూజియం ద్వారా భారతదేశ అనాది నాగరికతా ప్రయాణం, వైవిధ్యం, భౌతిక మరియు అభౌతిక వారసత్వాన్ని సమగ్రంగా ప్రదర్శించనున్నారు. అత్యాధునిక ఇమ్మర్సివ్ సాంకేతికత, సందర్శకులను ఆకట్టుకునే ప్రత్యేక థీమాటిక్ గ్యాలరీలతో అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలకు ధీటుగా దీనిని రూపొందిస్తున్నారు. పూర్తయిన తర్వాత సుమారు 1,78,509 చదరపు మీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద ప్రదర్శనా స్థలం (డిస్‌ప్లే ఏరియా) కలిగిన మ్యూజియంగా ఇది రికార్డు సృష్టించనుంది. ఈ ప్రాజెక్టును 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి 2030-31 వరకు దశలవారీగా పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా మొదటి పబ్లిక్ గ్యాలరీ అయిన 'అడోర్న్‌మెంట్'ను నార్త్ బ్లాక్‌లో 2027 ద్వితీయార్ధంలో సందర్శకులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ మ్యూజియాన్ని ఏటా దాదాపు ఒక కోటి మందికి పైగా సందర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. కేబినెట్ ఆమోదించిన రూ.3,230 కోట్ల నిధులను గ్యాలరీల అభివృద్ధి, ప్రాచీన వస్తువుల భద్రత, పరిరక్షణ, సందర్శకుల సౌకర్యాలు, ల్యాండ్‌స్కేపింగ్, ఇంటెలిజెంట్ బిల్డింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, అధునాతన మౌలిక వసతుల కల్పన కోసం వినియోగిస్తారు. భవిష్యత్తులో టికెట్ల విక్రయాలు, ఆహార మరియు పానీయాల విభాగాలు, ప్రత్యేక కార్యక్రమాల వేదికల అద్దెలు, డిజిటల్



అనుభవాలు, గైడెడ్ టూర్లు మరియు ప్రత్యేక రిటైల్ ఔట్‌లెట్ల ద్వారా మ్యూయానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకోనున్నారు. ఈ ప్రాజెక్టును ప్రధాని నరేంద్ర మోదీ 2023 మే 18న తొలిసారిగా ప్రకటించగా, 2026 జూలై 27న పబ్లిక్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు దీనికి ప్రాథమిక అనుమతులు మంజూరు చేసింది. తాజా కేబినెట్ ఆమోదంతో పనులు మరింత వేగవంతం కానున్నాయి.

పిల్లలకు ఈత నేర్పిస్తూ- వైకల్యాన్ని జయించి స్ఫూర్తిగా నిలిచిన యువకుడు!

వినికిడి, దృష్టి లోపం ఉన్న స్విమ్మింగ్ ట్రైనర్ అక్షయ్ నవలే తన అంకితభావంతో వందలాది మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

ఆయన మాట్లాడలేరు. అలాగే మనం చెప్పింది వినలేరు. అంటే మూగ, చెవిటివారు అన్నమాట. అయితేనేం గొప్ప పట్టుదల, సంకల్పం ఉంది ఆయన దగ్గర. మనం మాట్లాడుకుంటున్నది ఇంకెవరి గురించో కాదు. మహారాష్ట్రలోని నాగ్‌పుర్‌కు చెందిన స్విమ్మింగ్ కోచ్ అక్షయ్ నవలే(28) గురించి. ఆయన వినలేకపోయినా, మాట్లాడలేకపోయినా వందలాది మంది పాఠశాల విద్యార్థులకు ఈత ఎలా నేర్చుకోవాలో? నీటిలో సురక్షితంగా ఎలా ఉండాలో? బోధిస్తున్నారు. అంతేకాకుండా సరస్సులోకి దూకి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిన ఓ మహిళను సైతం కాపాడారు. ఈ క్రమంలో స్విమ్మింగ్ కోచ్ అక్షయ్ నవలే గురించి 'ఈటీవీ భారత్' ప్రత్యేక కథనం.

బాల్యంలో అనారోగ్య సమస్యలు

చిన్నప్పటి నుంచి అక్షయ్ నవలే జీవితం ఇతర పిల్లల కంటే భిన్నంగా సాగింది. పుట్టుకతోనే దృష్టి, వినికిడి లోపం కారణంగా ఆయన కమ్యూనికేషన్ పరంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నారు. అయితే ఈ అడ్డంకులు అక్షయ్ సంకల్పాన్ని ఏమాత్రం తగ్గించలేకపోయాయి. పదేళ్ల వయస్సులో ఫిట్స్ (మూర్ఛ వ్యాధి) సమస్య రూపంలో ఆ కుర్రాడి జీవితంలో మరో కుదుపు మొదలైంది. ఇది మాత్రం ఆయన జీవితాన్ని మరో మలుపు తిప్పింది. అక్షయ్ అనారోగ్య సమస్యలు పట్ల అతని తల్లిదండ్రులను తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అంతలోనే ఒకరోజు అక్షయ్ తనకు ఈత నేర్చుకోవాలని ఉందని పేరెంట్స్‌కు చెప్పారు. తమ కుమారుడి కోరికను తల్లిదండ్రులు అంగీకరించారు. ఏమాత్రం సంకోచించకుండా 'కామ్‌గర్ కల్యాణ్' విభాగం నిర్వహించే వేసవి శిక్షణ తరగతుల్లో చేర్పించారు.

ఈతలో నైపుణ్యం

కాలక్రమేణా అక్షయ్ ఈతలో ఎంత ప్రావీణ్యం సంపాదించాడంటే, ఇప్పుడు ఆయనే స్వయంగా వందలాది మంది



పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. అంతేకాకుండా క్రమం తప్పకుండా ఈత సాధన చేయడం వల్ల ఆయనకు ఉన్న ఫిట్స్ కూడా తగ్గిపోయింది. అయితే ఈ స్విమ్మింగ్ కోచ్‌కు ఈ విజయం అంత ఈజీగా దక్కలేదు. ఎన్నో ఆటుపోట్లను, సవాళ్లను ఎదుర్కొన్నాకే ఈ విజయానికి చేరువయ్యారు. నీటిలోకి అడుగుపెట్టడం నుంచి సరైన ఈత పద్ధతులను అభ్యసించే వరకు అక్షయ్ ప్రయాణం కఠోర శ్రమతో కూడుకున్నది. వినికిడి లోపం ఉండటం వల్ల అక్షయ్ తన కోచ్‌ల మౌఖిక సూచనలను వినలేకపోయేవారు. అందుకు బదులుగా బాడీ లాంగ్వేజ్, ప్రత్యక్ష ప్రదర్శనలు, దృశ్య సంకేతాల ద్వారా స్విమ్మింగ్ నేర్చుకున్నారు. నిరంతర సాధన, అచంచలమైన సంకల్పంతో ఈతలో అద్భుతమైన నైపుణ్యాన్ని సాధించారు. అక్షయ్ ప్రయాణంలో ఆయన తండ్రి పాత్ర కీలకం. అక్షయ్ మొదటిసారి స్విమ్మింగ్ క్లాసుల్లో చేరినప్పుడు శిక్షకులు అతని హావభావ

కార్తీకమాసం సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో ఉచిత అన్నప్రసాద వితరణ ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి దంపతులు

- 41 రోజుల పాటు కొనసాగనున్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం..

- తొలి రోజు సుమారు 3 వేల మంది అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ









మిర్యాలగూడ నవంబర్ 11 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో కార్తీకమాస పర్వదినాన్ని పురస్కరించుకొని, మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో లిబి ఎల్ ఆర్ బ్రదర్స్ ప్రతి సంవత్సరం కొనసాగిస్తున్న సంప్రదాయంలో భాగంగా అయ్యప్ప, ఆంజనేయ, శివమాలలు ధరించి దీక్షలో ఉన్న భక్తుల కోసం ప్రతిరోజూ నిర్వహించనున్న ఉచిత అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన సతీమణి మాధవి తో కలిసి ప్రారంభించారు...ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయంగా దీక్షా స్వాములకు అన్నప్రసాదాలను వడ్డించి, వారితో కలిసి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ..

తొలిరోజు నిర్వహించిన ఈ కార్యక్రమంలో దాదాపు 3 వేల మంది అయ్యప్ప, ఆంజనేయ, శివమాలధారులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. కార్తీకమాసంలో దీక్షలు చేపట్టిన స్వాములకు సేవ చేయడం ఎంతో పవిత్రమైన కార్యమని, భక్తి, సేవాభావంతో బి ఎల్ ఆర్ బ్రదర్స్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కొనసాగిస్తున్న ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా 41 రోజుల పాటు నిరంతరాయంగా నిర్వహించనున్నట్లు తెలిపారు... దీక్షలో ఉన్న స్వాములందరూ ఈ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగస్వాములై స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రమణారెడ్డి , మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ , వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్ , రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు బి ఎల్ ఆర్ బ్రదర్స్ సభ్యులు పాల్గొన్నారు...

ఈదుల గూడ జంక్షన్ వద్ద 100 ఫీట్ల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

- పట్టణ ప్రజలకు రాకపోకల్లో ఇబ్బందులు లేకుండా.. ప్రమాదాల నివారణే లక్ష్యంగా రోడ్డు నిర్మాణం






మిర్యాలగూడ నవంబర్ 11 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ పట్టణంలోని ఈదుల గూడ జంక్షన్ వద్ద ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా, ప్రధాన రహదారిపై సురక్షితంగా ప్రయాణించేలా ప్రమాదాల నివారణ లక్ష్యంగా చేపట్టిన 100 ఫీట్ల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ఈరోజు మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి కొబ్బరికాయ కొట్టి లాంఛనంగా ప్రారంభించారు...ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పట్టణ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు, ట్రాఫిక్ సమస్యలను తగ్గించి ప్రమాదాల నివారణకు అవసరమైన మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ..ఈదుల గూడ జంక్షన్ వద్ద 100 ఫీట్ల సిమెంట్ రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణం నుంచి ప్రధాన రహదారిపైకి వెళ్లే వాహనదారులకు, ప్రజలకు మరింత సౌకర్యవంతమైన రాకపోకలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు...ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్ , మున్సిపల్ చైర్‌పర్సన్ చిలుకూరి సుధా బాలకృష్ణ , వైస్ చైర్‌పర్సన్ గుడిపాటి శిరీష నవీన్, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు...

నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొని కుటుంబ సభ్యులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు



మిర్యాలగూడ నవంబర్ 11 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)

మిర్యాలగూడ నియోజకవర్గం, మాడ్గులపల్లి మండలం ఇస్కబావిగూడెం గ్రామానికి చెందిన వల్లపుదాసు అనిల్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లమోతు భాస్కర్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహ యజమాని వల్లపుదాసు అనిల్ కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి, నూతన గృహంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో కలకాలం వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమములో మండల పార్టీ అధ్యక్షులు పాలుట్ల బాబయ్య, నిమ్మల నవీన్ రెడ్డి, సీతారాం రెడ్డి, గుర్రటవెంకట్ రెడ్డి, తంగెళ్ల శ్రీనివాస రెడ్డి, అశోక్, శేఖర్, పుట్ట శ్రీను తదితరులు ఉన్నారు..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

PACS, ఐకేపీ కేంద్రాలకు రైస్ మిల్లులు కేటాయించాలి రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు

(సంగారెడ్డి మండలం) నవంబర్ 11 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి జయరాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు రైతు సంఘం ఆధ్వర్యంలో సివిల్ సప్లై డీఎం జయశ్రీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వెంటనే రైస్ మిల్లులను కేటాయించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, హమాలీల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతులు ధాన్యం విక్రయించే సమయంలో ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను కోరారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎస్. రమేష్ గౌడ్, నాయకులు విట్టల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్



ఎల్కతుర్తి నవంబర్ 11 ప్రజా న్యూస్ నెట్వర్క్:

హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ ఎల్కతుర్తి మండలంలోని చింతలపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన మాజీ ఎంపీటీసీ బొంకూరి కొమురయ్య బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు దుకిరే రాజేశ్వరరావు తండ్రి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారి నివాసానికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులు బొంకూరి కార్తీక్ క్రాంతి కుమార్ దుకిరే రాజేశ్వరరావు తదితరులను ఓదార్చారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. భగవంతుని కృప వారిపై ఎల్లవేళలా ఉండాలని బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిట్టల మహేందర్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీపతి రవీందర్ గౌడ్ తంగెడ మహేందర్ మేకల స్వప్న సుదర్శన్ యేల్తూరి స్వామి సాతూరి చంద్రమౌళి మునిగడప శేషగిరి కడారి రాజు తంగెడ నగేష్ బొంకూరి రజిత గుండా ప్రతాపరెడ్డి అంబాల రాజ్ కుమార్ మంకని చేరాలు సాతూరి శంకర్ మదార్ వేముల శ్రీనివాస్ మేకల బాబురావు బుసరి శివాజీ హింగే రమేష్ ఎడ్ల రవీందర్ రెడ్డి మోరే బాబురావు సుదర్శన్ మద్దె కుమార్ తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులను పరామర్శించారు

బాచుపల్లి శివాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన బిక్ష ప్రారంభం

మొదటి రోజు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్


కుత్బుల్లాపూర్ , నవంబర్ 11: ప్రజా న్యూస్ నెట్వర్క్ ..


అయ్యప్ప స్వాముల సేవే లక్ష్యంగా బాచుపల్లి శివాలయం ప్రాంగణంలోని అయ్యప్ప స్వామి సన్నిధానంలో మొదటి రోజు అన్నదాన బిక్ష కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. మాజీ సర్పంచ్ ఆగం పాండు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ సన్నిధానంలో అయ్యప్ప స్వాములకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ అన్నదాన బిక్షను ప్రారంభించి అయ్యప్ప స్వాములకు స్వయంగా భోజనం వడ్డించారు. అయ్యప్ప దీక్ష కొనసాగించే కాలమంతా ప్రతిరోజూ స్వాములకు మధ్యాహ్న బిక్ష అందించాలనే సంకల్పంతో ఆగం పాండు ముదిరాజ్ ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తూ, అయ్యప్ప మాలధారణ చేసిన స్వాములకు సన్నిధానంలో ఆశ్రయం కల్పిస్తూ, వారికి అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు. ఆగం పాండు ముదిరాజ్ చేస్తున్న ఈ సేవలు పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నాయి.

తండ్రి బాటలో తనయుడు..

తండ్రి అడుగుజాడల్లో తనయుడు అన్నట్లుగా ఆగం పాండు ముదిరాజ్ కుమారుడు ఆగం కిరణ్ కుమార్ ఈ ఏడాది తొలిసారిగా అయ్యప్ప మాలధారణ చేసి కన్యాస్వామిగా దీక్షను ప్రారంభించారు. భక్తి, సేవాభావంతో కుటుంబ సభ్యులు అయ్యప్ప స్వాముల సేవలో భాగస్వాములు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయ్యప్ప స్వాముల దీక్షా కాలమంతా ఈ సన్నిధానంలో అన్నదాన బిక్ష కార్యక్రమం కొనసాగనుండటంతో స్వాములు హర్షం వ్యక్తం చేస్తున్నారు.





ఏం జీ బి ఎస్ వద్ద డివైడర్ కి దికొట్టిన ట్రావెల్ బస్సు



హైదరాబాద్ నవంబర్ 11 (ప్రజా న్యూస్ నెట్ వర్క్) :

నగరంలోని మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) వద్ద ట్రావెల్స్‌కు చెందిన ఓ ప్రైవేట్ బస్సు తెల్లవారుజామున రద్దీ లేని సమయంలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు ముందు భాగం దెబ్బతినగా, డివైడర్‌కు సంబంధించిన సిమెంట్ భాగాలు ధ్వంసమై రోడ్డుపై పడ్డాయి. బస్సు ముందు భాగం బలంగా దెబ్బతినడంతో పాటు డివైడర్ కూడా ధ్వంసమైనట్లు తెలుస్తుంది ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. డ్రైవర్ నిర్లక్ష్యమా, అతివేగమా లేక వాహనంలో సాంకేతిక లోపమా అనే విషయాలు అధికారుల విచారణ చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు గాయాలయ్యాయా ఎవరైనా గాయపడకుండా బయటపడ్డారా అనే వివరాలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. ఘటనపై ట్రాఫిక్ పోలీసులు బస్సుని పక్కకు తొలగించారు ఇ ప్రమాదంపై విచారణ చేపట్టి ప్రమాదానికి గల కారణాలను వెల్లడించాల్సి ఉంది.

నిజాంపేట్ సర్కిల్ డంపింగ్ యార్డ్ మరియు స్వచ్ఛ ఆటో యూనియన్ కార్మికుల సమస్యలపై వినతిపత్రం

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి, తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ



కుత్బుల్లాపూర్. నవంబర్. 11ప్రజా న్యూస్ నెట్వర్క్ ..
వినతిపత్రం అందజేశారు. కార్మికుల సమస్యలను సావధానంగా విన్న కొలన్ హన్మంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజేందర్, గణేష్, మోహన్ గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహోన్నతమైన పుణ్యకార్యం అమరగాని కృష్ణ

రామాపురంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమం



చిలుకూరు, నవంబర్ 11(ప్రజా న్యూస్ నెట్ వర్క్ సూరిబాబు)
నియమ నిష్ఠలతో అయ్యప్ప దీక్షలో ఉన్న స్వాములతో పాటు ఇతర భక్తులకు అన్నదానం చేయడం ఎంతో గొప్ప పుణ్యకార్యమని మీడియా టుడే దినపత్రిక జిల్లా స్టాఫర్ అమరగాని కృష్ణ అన్నారు. బుధవారం చిలుకూరు మండల పరిధిలోని రామాపురం గ్రామంలో తన నివాసంలో అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమం నిర్వహించినారు అనంతరం స్వామివారికి పాలాభిషేకం పల్లకి సేవ నిర్వహించినారు అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వార్థం లేని సేవాభావంతో భక్తులకు అన్నం పెట్టడం దైవసేవతో సమానమని పేర్కొన్నారు. అన్నదానం ద్వారా ఆకలితో ఉన్నవారి ఆకలి తీర్చడమే కాకుండా సమాజంలో భక్తిభావం, దైవచింతన, సేవాగుణం పెంపొందుతాయని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపుతాయని, భవిష్యత్తులోనూ మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు...

భారత రాజ్యాంగం బహుజనుల ఐక్యత కోసం నిర్వహించే సభను విజయవంతం చేయాలి



(సంగారెడ్డి మండలం) నవంబర్ 11 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..
డిసెంబర్ 8, 2026న సంగారెడ్డిలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించనున్న “భారత రాజ్యాంగం బహుజనుల ఐక్యత కోసం” సభకు సంబంధించిన కరపత్రాన్ని TGIIC చైర్మన్ శ్రీమతి తూర్పు నిర్మల జగ్గారెడ్డి గారు తన నివాసంలో విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ సభకు జిల్లా వ్యాప్తంగా ఉన్న మేధావులు, రచయితలు, కవులు, అంబేద్కర్ సంఘాల నాయకులు, బహుజన ఉద్యమ నాయకులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బహుజన చైతన్య సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు ఎర్రారం దేవదాస్, బహుజన సాహిత్య అకాడమీ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ్రాట్ గోవర్ధన్, మల్కాపూర్ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, మల్కాపూర్ ఉపసర్పంచ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సోనియాగాంధీ జీవిత చరిత్ర ఆధారంగా తెలుగులో సినిమా తీస్తా జగ్గారెడ్డి

- సినిమా నిర్మాణానికి సంగారెడ్డి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలు

- సంగారెడ్డిలో కార్యకర్తల సమావేశంలో వెల్లడించిన TPCC వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



(సంగారెడ్డి మండలం) నవంబర్ 11 ప్రజా న్యూస్ నెట్వర్క్ ప్రతినిధి సంతోష్ కుమార్..

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియాగాంధీ జీవిత చరిత్రను ఆధారంగా చేసుకొని తెలుగులో సినిమా నిర్మించనున్నట్లు ఖాజజ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడించారు. సోనియాగాంధీ రాసిన “బీలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్” పుస్తకం ఆధారంగా ఈ సినిమాను రూపొందించనున్నట్లు తెలిపారు. సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన ఈ విషయాన్ని ప్రకటించారు.ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. సోనియాగాంధీ జీవితంలోని ముఖ్య ఘట్టాలను, ఇందిరాగాంధీ కోడలిగా, రాజీవ్ గాంధీ భార్యగా, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల తల్లిగా ఆమె సాగించిన జీవిత ప్రయాణాన్ని సినిమాలో చూపిస్తానన్నారు. దేశ రాజకీయాల్లో సోనియాగాంధీకి ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆమెది విజయవంతమైన రాజకీయ ప్రస్థానమని పేర్కొన్నారు.ప్రధాని అయ్యే అవకాశం ఉన్నప్పటికీ సోనియాగాంధీ ఆ పదవిని ఆశించలేదని, ఖూూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధానిగా ఉండాలని అందరూ కోరినా మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ఎంపిక చేశారని గుర్తుచేశారు. అలాగే పీవీ నరసింహారావు ప్రధానమంత్రి కావడానికి సోనియాగాంధీ అవకాశం కల్పించారన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలన్నది సోనియాగాంధీ ఆకాంక్ష అని తెలిపారు.ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీలు దేశం కోసం చేసిన త్యాగాలను సోనియాగాంధీ దగ్గరుండి చూశారని, కాంగ్రెస్ పార్టీ సముద్రం అంత లోతైన రాజకీయ వ్యవస్థతో కూడుకున్నదని వ్యాఖ్యానించారు.ఈ సినిమా నిర్మాణ ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని, ఇందుకోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తానని జగ్గారెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా సినిమా షూటింగ్ ప్రారంభిస్తానని వెల్లడించారు. ఈ సినిమాకు సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే నిర్మాతలుగా వ్యవహరిస్తారని, పార్టీ నాయకులు నిర్మాణానికి అవసరమైన నిధులు సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

త్రిపురారం ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మంగత్ నాయక్

మహిళా నాయకత్వానికి ప్రాధాన్యం.. నూతన కమిటీకి సత్కారం

అప్పలమ్మగూడెంలో ఘనంగా అభినందన కార్యక్రమం



త్రిపురారం మండలం, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, రిపోర్టర్ గాసిరాం :
త్రిపురారం మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా ధనావత్ మంగత్ నాయక్, ఉపాధ్యక్షురాలిగా ఎస్.కె. సైదాభి ఎన్నికయ్యారు. మహిళా అధ్యక్షురాలిగా గడ్డం నర్సమ్మ ఎన్నికైన సందర్భంగా అప్పలమ్మగూడెం గ్రామపంచాయతీలో గ్రామసభ అనంతరం అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ధనావత్ శ్రీదేవి రాజు నాయక్ నూతనంగా ఎన్నికైన వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు. మండలంలోని గ్రామపంచాయతీల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన కమిటీ కీలకంగా పనిచేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు ధనావత్ నాగమణి, లాలు నాయక్, ధనావత్ జాను నాయక్, రెడ్డి హుస్సేన్, గ్రామ కార్యదర్శి అరుణకుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

గోపాలపురంలో ముమ్మరంగా భూ రీసర్వే పనులు

– క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎంఆర్ఓ వెంకన్న

– పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



మోతే మండలం, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, మండల ప్రతినిధి యల్లారెడ్డి : మోతే మండలం గోపాలపురం గ్రామంలో భూ రీసర్వే పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ పనులను ఎంఆర్ఓ వెంకన్న క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే నిర్వహణ తీరును పర్యవేక్షించారు. ముందుగా రైతులకు నోటీసులు జారీ చేసి, ప్రభుత్వ భూములకు హద్దులు నిర్ణయించిన అనంతరం ఆధునిక యంత్రాల సహాయంతో భూముల కొలతలు చేపడుతున్నారు. ఈ సందర్భంగా ఎంఆర్ఓ మాట్లాడుతూ ప్రతి రైతు భూమిని కచ్చితమైన కొలతలతో నమోదు చేయాలని, సర్వేలో పారదర్శకత పాటిస్తూ వేగంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, భవిష్యత్తులో భూ వివాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్తగా రీసర్వే నిర్వహించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వీరస్వామి, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

కొట్లాట కేసులో పోలీస్ కానిస్టేబుల్‌కు 6 నెలల జైలు శిక్ష!

హుజూర్‌నగర్ విద్యారంగానికి భారీ ఊతం.. కళాశాల భవనాలు ప్రారంభానికి సిద్ధం!

- రూ.11.90 కోట్లతో జూనియర్, డిగ్రీ కళాశాలల నిర్మాణం

తొమ్మిదేళ్ల తర్వాత వెలువడిన తీర్పు.. రూ.2 వేల జరిమానా విధించిన కోర్టు!

మూడు సెక్షన్ల కింద నిందితుడికి శిక్ష ఖరారు!



కోదాడ, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
అనంతగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017లో నమోదైన కొట్లాట కేసులో తొమ్మిదేళ్ల తర్వాత న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడైన పోలీస్ కానిస్టేబుల్ కీత సురేష్‌కు కోదాడ ప్రథమ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ మహమ్మద్ ఉమర్ ఆరు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు మొత్తం రూ.2 వేల జరిమానా విధించారు. మూడు సెక్షన్ల కింద నేరం నిర్ధారణ కావడంతో న్యాయస్థానం ఈ శిక్ష ఖరారు చేసింది. 2017లో నమోదైన కేసుకు తాజాగా తీర్పు వెలువడటంతో ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

- త్వరలోనే రెండు కళాశాల భవనాల ప్రారంభం: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





హుజూర్‌నగర్ పట్టణం, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

హుజూర్‌నగర్ పట్టణంలో ప్రభుత్వ విద్యా వసతుల అభివృద్ధికి మరో ముందడుగు పడుతోంది. విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన కళాశాల భవనాలు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలల భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని రూ.7.25 కోట్లతో, ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాన్ని రూ.4.65 కోట్లతో నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. మొత్తం రూ.11.90 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ రెండు భవనాలను త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన తరగతి గదులు, ఆధునిక వసతులు కల్పించడం ద్వారా ప్రభుత్వ విద్యాసంస్థలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం ప్రస్తుతం పాత భవనంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల తరగతి గదులకు వెళ్లి వారితో నేరుగా మాట్లాడారు. చదువులో ఎదుర్కొంటున్న సమస్యలు, కళాశాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, అవసరాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. కొత్త భవనాలు అందుబాటులోకి వస్తే హుజూర్‌నగర్ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కలగనుంది. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్పీ కాలువ భూముల అక్రమ రిజిస్ట్రేషన్‌పై పోలీసుల కేసు

- 1971లోనే భూసేకరణ.. మళ్లీ ప్రైవేటు పేర్లపై రిజిస్ట్రేషన్ ఎలా?

తప్పుడు అండర్‌టేకింగ్ వ్యవహారంలో ఆరుగురిపై కేసు



హుజూర్‌నగర్, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, జిల్లా ప్రతినిధి షేక్ అబ్దుల్ రజాక్ :

నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువ నిర్మాణం కోసం దశాబ్దాల క్రితమే ప్రభుత్వం సేకరించి పరిహారం చెల్లించిన భూములు తిరిగి ప్రైవేటు వ్యక్తుల పేర్లపై రిజిస్ట్రేషన్ కావడం హుజూర్‌నగర్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. ప్రభుత్వ భూముల రక్షణ, రెవెన్యూ రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అధికారుల అప్రమత్తతపై ప్రశ్నలు లేవనెత్తుతున్న ఈ వ్యవహారంలో హుజూర్‌నగర్ పోలీసులు క్రైమ్ నంబర్ 255/2026 కింద ఆరుగురిపై కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. మేళ్లచెర్వు గ్రామానికి చెందిన బోనగిరి సామ్రాజమ్మ తండ్రి భువనగిరి వెంకటనర్సయ్యకు గతంలో హుజూర్‌నగర్, మేళ్లచెర్వు ప్రాంతాల్లో వ్యవసాయ భూములు ఉండేవి. 1971లో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కాలువల నిర్మాణం కోసం హుజూర్‌నగర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 458లో ఉన్న భూమిని ప్రభుత్వం భూసేకరణ చట్టం ప్రకారం సేకరించి పరిహారం చెల్లించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అయితే ఆ భూమి రెవెన్యూ రికార్డుల్లో ఎన్ఎస్పీ కాలువ భూమిగా నమోదు కాకపోవడంతో రికార్డుల్లో కొనసాగుతున్న పట్టా వివరాలను ఆసరాగా చేసుకుని విక్రయానికి ప్రయత్నించినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. సర్వే నంబర్ 458/ఊ3/3లో 9 ఎకరాల 16 గుంటల భూమి సామ్రాజమ్మ పేరున ఉన్నట్లు రికార్డుల్లో గుర్తించినట్లు తెలిపారు. ఈ భూమి కొనుగోలు వ్యవహారంలో పసుపులేటి రామారావు కీలక పాత్ర పోషించినట్లు పోలీసుల కథనం. జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కన్నె కొండల్‌రావు, బేత వెంకట్‌రెడ్డి, శేషం రవి తదితరులు కొనుగోలు ఒప్పందంలో భాగస్వాములైనట్లు పేర్కొన్నారు. భూమి రిజిస్ట్రేషన్ అగ్రిమెంట్‌ను చూపించి హైదరాబాద్‌కు చెందిన కనుమూరి కళ్యాణ్ కుమార్ వద్ద ఫైనాన్స్ పొందేందుకు ప్రయత్నించగా, తొలుత రూ.1.50 కోట్లు కోరినప్పటికీ రూ.1.30 కోట్లు ఇచ్చేందుకు అంగీకారం కుదిరినట్లు దర్యాప్తులో వెల్లడైందని పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో 2026 ఆగస్టు 6న హుజూర్‌నగర్ తహశీల్దార్ కార్యాలయంలో సంబంధిత వ్యక్తులు హాజరై రెవెన్యూ అధికారులకు తప్పుడు అండర్‌టేకింగ్ సమర్పించి కనుమూరి కళ్యాణ్ కుమార్ పేరున భూమిని రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ లావాదేవీల్లో రూ.1,07,95,089 విలువైన చెక్కును సామ్రాజమ్మ బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు, అందులో నుంచి రామారావు కుమార్తె లావణ్య ఖాతాకు రూ.5 లక్షలు, మరో వ్యక్తికి సంబంధించిన ఖాతాకు రూ.6 లక్షలు బదిలీ చేసినట్లు పోలీసుల వివరాలు పేర్కొంటున్నాయి. సామ్రాజమ్మకు రూ.లక్ష నగదు ఇచ్చినట్లు కూడా దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపారు. ఈ వ్యవహారంపై బోనగిరి సామ్రాజమ్మ, పసుపులేటి రామారావు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, కన్నె కొండల్‌రావు, బేత వెంకట్‌రెడ్డి, శేషం రవిపై దీచీూ సెక్షన్లు 61(2), 318(4), 338, 336(3), 217 తీ/ష 3(5) కింద పోలీసులు కేసు నమోదు చేశారు. సామ్రాజమ్మకు నోటీసు జారీ చేసినట్లు కేసు వివరాల్లో పేర్కొన్నారు. మిగిలిన నిందితులపై తదుపరి చర్యలు చేపట్టినట్లు సమాచారం. ఇప్పటికే ప్రభుత్వ అవసరాల కోసం భూసేకరణ జరిగిన భూమి తిరిగి ప్రైవేటు పేరుతో రిజిస్ట్రేషన్ కావడం వెనుక అసలు పరిణామాలేమిటి? భూసేకరణ సమయంలో పరిహారం చెల్లించిన రికార్డులు ఉన్నప్పటికీ రెవెన్యూ రికార్డుల్లో మార్పులు ఎందుకు జరగలేదు? రిజిస్ట్రేషన్‌కు ముందు సంబంధిత భూమి స్వరూపం, ప్రభుత్వ హక్కులు, పాత భూసేకరణ పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించారా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి పాత్రతో పాటు రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జరిగిన పరిణామాలపై సమగ్ర విచారణ జరగాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ భూములకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, తప్పిదాలకు బాధ్యులెవరో తేల్చాలని, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికంగా చర్చ జరుగుతోంది.

రెడ్లకుంట ఎత్తిపోతల పనులకు డిసెంబర్ 31 డెడ్‌లైన్.. మంత్రి అల్టిమేటం!

- గడువులోగా పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తప్పవు.. అధికారులకు ఉత్తమ్ హెచ్చరిక!

- రైతులకు సాగునీరు అందించడంలో నిర్లక్ష్యం సహించేది లేదు.. రాజీవ్ శాంతినగర్‌కు ఫిబ్రవరి గడువు!





రెడ్లకుంట, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :

సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంలో ఇక జాప్యానికి తావులేదని, నిర్ణయించిన గడువుల్లో పనులు పూర్తి చేయాల్సిందేనని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులకు, కాంట్రాక్టర్లకు తేల్చిచెప్పారు. రెడ్లకుంట ఎత్తిపోతల పథకం నిర్మాణ పనులను బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించిన మంత్రి, డిసెంబర్ నెలాఖరులోగా పనులను ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గడువు విధించిన తర్వాత కూడా పనుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించినా, లక్ష్యాన్ని చేరుకోవడంలో జాప్యం చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేవలం హామీలు, నివేదికలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనులు వేగంగా జరగాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.రాజీవ్ శాంతినగర్ ఎత్తిపోతల పథకం పనులకు కూడా మంత్రి స్పష్టమైన గడువు విధించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలని, దానికి అనుబంధంగా చేపట్టిన చెక్‌డ్యామ్‌ల పనులను సైతం అదే సమయంలోగా పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రధాన ప్రాజెక్టులు పూర్తయినా అనుబంధ నిర్మాణాలు అసంపూర్తిగా మిగిలిపోకూడదని, అన్ని పనులను సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం జరిగితే రైతులకే నష్టం జరుగుతుందని స్పష్టం చేశారు. పనుల వేగం పెంచడంతో పాటు నిర్మాణ నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, పటిష్టమైన నిర్మాణాలు చేపట్టి రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనం కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో ఎంపీ రఘువీర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ నర్సింహా, ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ నాగభూషణం, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రెడ్లకుంట పనులకు డిసెంబర్ నెలాఖరు, రాజీవ్ శాంతినగర్ ప్రాజెక్టు, చెక్‌డ్యామ్‌లకు ఫిబ్రవరి గడువు విధించడంతో పనుల పురోగతిపై అధికారులపై బాధ్యత మరింత పెరిగింది.

టీడీపీలో చేరిన నామవరం ఎంపీటీసీ సభ్యుడు సూర్యారావు

- హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో పార్టీ కండువా కప్పుకున్న కొరిమి సూర్యారావు



పాయకరావుపేట (నామవరం), నవంబర్ 11 ప్రజా న్యూస్ నెట్వర్క్:
పాయకరావుపేట మండలం నామవరం ఎంపీటీసీ సభ్యుడు కొరిమి సూర్యారావు తెలుగుదేశం పార్టీలో చేరారు. విశాఖపట్నంలోని హోం మంత్రి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సమక్షంలో ఆయన టీడీపీ కండువా ధరించారు. ఇటీవల జరిగిన పరిషత్ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన కొరిమి సూర్యారావు 179 ఓట్ల మెజారిటీతో ఎంపీటీసీ సభ్యుడిగా విజయం సాధించారు. అనంతరం టీడీపీలో చేరాలని నిర్ణయించుకుని హోం మంత్రి అనితను కలిశారు. ఈ సందర్భంగా అనిత స్వయంగా పార్టీ కండువా కప్పి సూర్యారావును తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడు శివతో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా బాశెట్టి హరిప్రసాద్ బాధ్యతల స్వీకరణ!

- ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన రెవెన్యూ సేవలే లక్ష్యం!

- అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తా: హరిప్రసాద్!



హుజూర్‌నగర్, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
హుజూర్‌నగర్ మండల నూతన తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా బాశెట్టి హరిప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు సూర్యాపేట ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ (డీఏఓ)గా విధులు నిర్వహించిన ఆయన, ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా హుజూర్‌నగర్ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ మండల ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించడమే తన ప్రాధాన్యమని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. రెవెన్యూ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సేవలు అందించేందుకు ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయ సిబ్బంది, పలువురు అధికారులు నూతన తహసీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

2024తో పోలిస్తే స్థానిక పోరులో వైసీపీ ఓటింగ్ శాతం పెరిగింది: జగన్

- తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో పలు జిల్లాల నేతలతో జగన్ కీలక భేటీ

- స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడిందని ఆరోపణ

- ఎన్నికల నిర్వహణలో సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారంటూ వ్యంగ్యం



ఆంధ్రప్రదేశ్‌లో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి ప్రభుత్వం తీవ్ర అక్రమాలకు పాల్పడిందని వైసీపీ అధినేత జగన్ ఆరోపించారు. ఎన్నికల అక్రమాల్లో చంద్రబాబు సరికొత్త ఆవిష్కరణలు తీసుకొచ్చారంటూ వ్యంగ్యం ప్రదర్శించారు. తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర కార్యాలయంలో పలు జిల్లాలకు చెందిన పార్టీ నేతలతో జగన్ ఈరోజు సమావేశమయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగిన తీరు, ఫలితాలపై నేతలతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... "చంద్రబాబు ప్రభుత్వం చేసిన అక్రమాలను ప్రజలంతా చూశారని, వాస్తవాలను ప్రజలు కూడా బాగా అర్థం చేసుకున్నారని" పేర్కొన్నారు. ఎన్నికలు ఏమాత్రం సజావుగా జరిగి ఉన్నా వైసీపీకి అనుకూలంగా ఇంకా భారీగా ఓటింగ్ శాతం నమోదయ్యేదని అన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి నామినేషన్లు, పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ అడ్డంకులు సృష్టించి అక్రమాలకు తెగబడ్డారని ఆరోపించారు.అన్ని రకాల అవకతవకలు, దాడులు జరిగినప్పటికీ వైసీపీకి ప్రజా మద్దతు తగ్గలేదని జగన్ స్పష్టం చేశారు. "2024 ఎన్నికలతో పోలిస్తే వైసీపీ ఓటింగ్ శాతం పెరిగింది" అని ఆయన వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశలోనూ అరాచకాలు, అన్యాయాలు చోటుచేసుకున్నప్పటికీ పార్టీ ఓటింగ్ శాతం పెరగడం వైసీపీ పట్ల ప్రజల్లో ఉన్న ఆదరణకు స్పష్టమైన నిదర్శనమని జగన్ వ్యాఖ్యానించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం శ్రమించిన నేతలు, కార్యకర్తలకు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.

హుజూర్‌నగర్‌లో ఎస్ఐ హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు!

- డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా!

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు.. హనుమాన్ నాయక్ హెచ్చరిక!



హుజూర్‌నగర్, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
హుజూర్‌నగర్ పట్టణంలోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఎస్ఐ హనుమాన్ నాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్‌లు, కార్ల తనిఖీలు, మైనర్ డ్రైవింగ్ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్లకు వాహనాలు ఇవ్వడం, సరైన లైసెన్స్ లేకుండా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకుంటామని హనుమాన్ నాయక్ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజల ప్రాణాల రక్షణే లక్ష్యంగా తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని సూచించారు.

కార్యకర్తల కష్టానికి తగిన గుర్తింపు ఇస్తాం: యనమల దివ్య

– కూటమి విజయానికి కార్యకర్తలే ప్రధాన బలం..

– మూడు మండలాల జడ్పీటీసీ, ఎంపీటీసీ విజేతలకు అభినందనలు

తుని,నవంబర్ 11 ప్రజా న్యూస్ నెట్‌వర్క్:
స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ప్రజలు అందించిన విజయాన్ని కార్యకర్తల శ్రమకు దక్కిన గుర్తింపుగా భావిస్తున్నామని ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేసిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇచ్చి, సముచిత స్థానం కల్పిస్తామని ప్రకటించారు. తుని, తొండంగి, కోటనందూరు మండలాలకు చెందిన కూటమి తరపున ఎన్నికైన జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు అభినందన సభ నిర్వహించారు. సీనియర్ నేత యనమల రాజేష్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమానికి తుని మండల టీడీపీ అధ్యక్షులు చింతంనీడి అబ్బాయి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ యనమల దివ్య మూడు మండలాల నుంచి ఎన్నికైన ప్రజాప్రతినిధులను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల్లో కూటమికి లభించిన విజయానికి కార్యకర్తల కృషి, పట్టుదలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. కూటమి గెలుపు కోసం క్షేత్రస్థాయిలో శ్రమించిన కార్యకర్తల సేవలను గుర్తించి తగిన ప్రాధాన్యత కల్పిస్తామని స్పష్టం చేశారు. నాయకుల కంటే కార్యకర్తలే పార్టీకి పునాదులని, వారి నిస్వార్థ సేవలను ఎప్పటికీ మరువబోమని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు



ప్రజలు మద్దతుగా నిలిచారని యనమల దివ్య తెలిపారు. గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలు ఆదరించడం వల్లే కూటమికి ఈ విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. పల్లె నుంచి పట్టణం వరకు కూటమి అభ్యర్థులకు ప్రజలు మద్దతు పలికారని, ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు చేపట్టిన యనమల దివ్య రెండేళ్ల పాలనపై ప్రజలు తమ తీర్పు ద్వారా విశ్వాసం వ్యక్తం చేశారని పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 15 వేల



ఓట్ల మెజార్టీ సాధించగా, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు 28 వేలకు పైగా మెజార్టీ రావడం ప్రజల మద్దతుకు నిదర్శనంగా నిలిచిందని వివరించారు. ఈ అభినందన కార్యక్రమంలో తుని, తొండంగి, కోటనందూరు మండలాలకు చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయసాయిరెడ్డి కొత్త పార్టీపై కేపీ పాల్ తీవ్ర వ్యాఖ్యలు



మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కొత్తగా ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీపై ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేపీ పాల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజయసాయిరెడ్డి పెట్టిన పార్టీ 'పరివర్తన పార్టీ' కాదని, అది 'అపరివర్తన అవినీతి పార్టీ' అని ఆయన ఎద్దేవా చేశారు. దాచుకున్న నల్లధనాన్ని కాపాడుకోవడానికే ఆయన మళ్లీ రాజకీయాల్లోకి వచ్చి కొత్త పార్టీని స్థాపించారని ఆరోపించారు.గతంలో రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించిన విజయసాయిరెడ్డి, ఇప్పుడు అక్రమ సంపాదనను కాపాడుకునేందుకు సరికొత్త వ్యూహంతో ముందుకు వచ్చారని కేపీ పాల్ విమర్శించారు. శ్రీకాకుళం నుంచి హైదరాబాద్ వరకు విస్తరించి ఉన్న ఆయన ఆస్తులను, దోచుకున్న సొమ్మును వెంటనే ప్రభుత్వానికి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఇంత భారీగా ఆస్తులు ఉన్నప్పటికీ విజయసాయిరెడ్డి ఆస్తులపై కేంద్ర దర్యాప్తు సంస్థ సీబీఐ ఎందుకు విచారణ జరపడం లేదని ఆయన సూటిగా ప్రశ్నించారు.అంతేకాకుండా, వైసీపీ అధినేత జగన్ ఓటు బ్యాంకును దెబ్బతీసేందుకే, ఇతర రాజకీయ శక్తుల కోసమే విజయసాయిరెడ్డి ఈ కొత్త పార్టీని ప్రారంభించారని కేపీ పాల్ ఆరోపించారు. రాష్ట్ర రాజకీయాల్లో దశాబ్దాలుగా ఒకే వర్గం ఆధిపత్యం చెలాయిస్తోందని, రాష్ట్రంలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు, 27 శాతం ఉన్న కాపులకు రాజ్యాధికారం ఎప్పుడు దక్కుతుందని ఆయన ఈ సందర్భంగా నిలదీశారు.

ఏపీకి మరో వాయుగుండం ముప్పు.. ఈ తేదీల్లో వర్షాలు కురిసే ఛాన్స్!



ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి వర్షాలు కురిసే అవకాశం కనిపిస్తోంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఎల్లుండి అల్పపీడనం ఏర్పడనుందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ఇది క్రమంగా బలపడి వాయుగుండంగా మారే సూచనలు ఉన్నాయని తెలిపింది. నవంబర్ 18 లేదా 19 నాటికి ఉత్తర తమిళనాడు తీరానికి చేరవచ్చని అంచనా వేసింది.అల్పపీడనం ఏర్పడిన 24 గంటల్లోనే తీవ్ర అల్పపీడనంగా బలపడుతుందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఆ తర్వాత వాయుగుండంగా మారే అవకాశముందని పేర్కొన్నారు. ఇది పశ్చిమ వాయవ్య దిశగా ప్రయాణిస్తూ ఉత్తర తమిళనాడు తీరం వైపు కదులుతుందని వివరించారు.ఈ ప్రభావంతో దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉంది. అయితే భారీ వర్షాల కంటే తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలే ఎక్కువగా నమోదయ్యే సూచనలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు.మరోవైపు ఉత్తర కోస్తాంధ్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రాబోయే మూడు రోజుల పాటు పొడి వాతావరణమే ఉంటుందని వాతావరణ కేంద్రం స్పష్టం చేసింది. ఆ తర్వాత అల్పపీడనం కదలికను బట్టి వర్షాల పరిస్థితిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఇందిరమ్మ కాలనీ లేఅవుట్ 2 నందు పడావు ఉన్న ఇండ్లను పరిశీలించిన కౌన్సిలర్ అశోక్ .



మిర్యాలగూడ నవంబర్ 11 (ప్రజా న్యూస్ నెట్వర్క్ పి వెంకటయ్య)
మిర్యాలగూడ పట్టణ పరిధిలో ఆరవ వార్డు ఇందిరమ్మ కాలనీ లేఅవుట్2 లో పడావు ఉన్న ఇండ్లవలన విషపురుగులు వస్తున్నాయని కాలనీవాసులు తెలియపరిచిన వెంటనేఈరోజు ప్రత్యక్షంగా పరిశీలించి వెంటనే మున్సిపల్ సిబ్బందిని మరియు జెసిబిని , ట్రాక్టర్ తెప్పించి పడావు ఇండ్లలో ఉన్న చెట్లు చెదారం తీయించి పడావు ఉన్న ఇళ్లను శుభ్రంగా చేయించడం జరిగింది. కాలనీవాసులు అందరూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ధనావత్ నాగు నాయక్, పార్టీ కార్యకర్తలు పాతనబోయిన వెంకటయ్య, సామాజికవేత్త పల్లె శ్రీనివాస్, రాచూరి బిక్షం , ఎస్కే మస్తాన్ ఆర్.ఎం.పి, నరేందర్ చారి, కాలనీ మహిళలు,మున్సిపాలిటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు చిరస్మరణీయం!

- జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా ఘనంగా నివాళులు!

- విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యం.. ఆజాద్ ఆశయాలను కొనసాగించాలి!

హుజూర్‌నగర్, నవంబర్ 11, ప్రజా న్యూస్ నెట్‌వర్క్, షేక్ అబ్దుల్ రజాక్, జిల్లా ప్రతినిధి :
ఆధునిక భారత విద్యారంగానికి బలమైన పునాదులు వేసిన మహనీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. ఆయన జయంతి, జాతీయ విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని హుజూర్‌నగర్ స్థానిక గ్రంథాలయంలో టీపీసీసీ రాష్ట్ర మాజీ జాయింట్ సెక్రటరీ ఎండీ అజీజ్ పాషా ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గెల్లి రవి, గ్రంథాలయ కమిటీ చైర్మన్ బచ్చు రామారావు, మాజీ సర్పంచ్ గొబ్బే రామయ్య, విజిలెన్స్ కమిటీ సభ్యులు గల్లా వెంకటేశ్వర్లు, పోతుల జ్ఞానయ్య ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వతంత్ర భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ దేశ విద్యావ్యవస్థ అభివృద్ధికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. యూజీసీ, ఐఐటీలు, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ వంటి విద్యా, సాంస్కృతిక సంస్థల



అభివృద్ధికి ఆయన అందించిన సేవలు దేశానికి చిరస్మరణీయమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా, జాతీయవాదిగా దేశ ఐక్యత కోసం ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో అభివృద్ధి, సమానత్వం సాధ్యమని, ఆజాద్ ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. 1888 నవంబర్ 11న జన్మించిన ఆజాద్ దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా 1992లో మరణానంతరం భారతరత్న పురస్కారం అందుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.కె. మన్సూర్ అలీ, గంజి శివ, మజీద్ భాయ్, బిక్కన్ సాబ్, ముషం సత్యనారాయణ, సైదులు నాయక్, కోలపూడి యోహాన్, కస్తాల దిల్, గొట్టిముక్కుల రాములు, ఎస్‌డీ ఆశ్రఫ్ అలీ, శ్రీనివాస్ రెడ్డి, మేళ్లచెరువు ముక్కంటి, నాగేందర్, చింతకాయల రాము, ఎస్. రఫీ, భార్గవ్, నవీన్, వినోద్, మధు, క్రాంతి, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రాలో నాన్-స్పైసీ అనే ఆప్షనే ఉండదు

: సీఐఐ సదస్సు వేళ నారా లోకేశ్ ఆసక్తికర పోస్ట్

విశాఖపట్నంలో రేపటి నుంచి జరగనున్న 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు హాజరయ్యేందుకు విచ్చేసిన అంతర్జాతీయ ప్రతినిధులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ వినూత్న రీతిలో స్వాగతం పలికారు. గ్లోబల్ డెలిగేట్స్‌ను ఆహ్వానిస్తూ ఆయన సోషల్ మీడియా వేదికగా చేసిన ఓ ఆసక్తికర పోస్ట్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది.రాష్ట్ర ప్రత్యేకతను వివరిస్తూ మంత్రి లోకేశ్ తనదైన శైలిలో చమత్కరించారు. "ఆంధ్రాలో 'నాన్-స్పైసీ' అనేది మెనూలో ఆప్షన్ కాదు" అంటూ ఆంధ్రప్రదేశ్ ఆహారపు ఘాటును, విశిష్ట రుచులను విదేశీ ప్రతినిధులకు పరిచయం చేశారు. రాష్ట్రంలో ఆహారం ఎంత ఘాటుగా ఉంటుందో, వ్యాపార పెట్టుబడులకు ఇచ్చే అనుమతులు కూడా అంతే వేగంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధి, ప్రభుత్వ పనితీరును ప్రస్తావిస్తూ లోకేశ్ ఓ ఆకర్షణీయమైన నినాదాన్ని తెరపైకి తెచ్చారు. "స్పైసీ ఫుడ్.. స్పీడీ అప్రూవల్స్.. ఇదే ఆంధ్ర విధానం" అంటూ ప్రపంచ పారిశ్రామికవేత్తలకు బలమైన సందేశాన్ని పంపారు. అతిథి మర్యాదలతో పాటు పరిశ్రమల ఏర్పాటుకు అత్యంత వేగంగా అనుమతులు మంజూరు చేస్తామనే స్పష్టమైన భరోసాను ఆయన కల్పించారు. రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం ఉందనే



విషయాన్ని స్పష్టం చేస్తూ మంత్రి చేసిన ఈ ట్వీట్ అందరినీ ఆకట్టుకుంటోంది.

80 లక్షల మంది పట్టభద్రులలో 10 లక్షల మంది కూడా ఓటు నమోదు చేసుకోలేదు: కవిత ఆందోళన

– గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన కవిత

– ఓటుతోనే మార్పు సాధ్యమని వ్యాఖ్య

– యువత డబ్బులకు అమ్ముడుపోకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని పిలుపు

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎన్ని పోరాటాలు చేసినా రాష్ట్రంలో ఎలాంటి మార్పు రాలేదని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శించారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో సర్వమత ప్రార్థనల అనంతరం ఆమె గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ఓటు ద్వారా ఇచ్చే తీర్పుతోనే సమాజంలో నిజమైన మార్పు సాధ్యమవుతుందని స్పష్టం చేశారు.రాష్ట్రంలో త్వరలోనే 77 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయని కవిత తెలిపారు. తెలంగాణలోని 4 కోట్ల జనాభాలో దాదాపు 80 లక్షల మంది వరకు గ్రాడ్యుయేట్లు ఉన్నారని, అయితే అందులో కనీసం 10 లక్షల మంది కూడా ఓటర్లుగా నమోదు చేసుకోకపోవడం బాధాకరమన్నారు. అర్హులైన పట్టభద్రులంతా వెంటనే ఓటు నమోదు చేసుకోవాలని, తమ ఓటు హక్కు ద్వారా కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.
ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎలాగైనా విజయం సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ఏకంగా రూ.200 కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని కవిత ఆరోపించారు. యువత ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా, డబ్బులకు అమ్ముడుపోకుండా ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.



ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసేందుకు తమ పార్టీ అభ్యర్థులకు వీర తిలకం దిద్ది ఎన్నికల యుద్ధరంగంలోకి దించుతున్నామని ఆమె పేర్కొన్నారు.